సాక్షి
హనుమకొండ
మంగళవారం | 12 | మార్చి | 2024



అభిషేకం చేసేదెలా? - 8లో ▸
ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గర్భగుడిలోని సోమసూత్రం మూసుకుపోయింది. దీంతో అభిషేక పూజలకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



నిలిచిన 'ఇంటర్‌సిటీ'
సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక లోపంతో గార్ల రైల్వే స్టేషన్‌లో నిలిచింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38^0 /24^0
వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదక వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

ఇఫ్తార్	సహర్
మంగళ 6:31	బుధ 5:04

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు
ఖిలా వరంగల్: రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం వేకువజాము నుంచి ప్రారంభవుతాయని వరంగల్ తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఈద్గా మసీదు ప్రతినిధి ఎంఏ జబ్బార్ తెలిపారు. మంగళవారం ఉదయం 5.07 నిమిషాలకు ఉపవాస దీక్షలు ప్రారంభించి.. సాయంత్రం 6.32 నిమిషాలకు విరమించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా.. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఈద్గా మసీదులో రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మసీదు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతోంది. ఉపవాస దీక్షాపరులకు, ప్రత్యేక ప్రార్థనలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

జేఎన్‌ఎస్‌లో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ప్రారంభం
వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఖేలో ఇండియా పథకం ద్వారా సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌ను సోమవారం కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ అధికారికంగా ప్రారంభించారు. జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న క్రీడా మౌలిక సదుపాయాలను ఆయన న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయినప్పటికీ తాజాగా అధికారికంగా ప్రారంభించడంపై పలువురు క్రీడాభిమానులు విస్మయానికి గురయ్యారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు
హన్మకొండ కల్చరల్: చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఐదోరోజు సోమవారం ముగిశాయి. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ, ఉదయం గణపతికి ఆరాధన, రుద్రేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం, రావి, వేప చెట్టు దగ్గర గల క్షేత్రపాలకుడైన ప్రసన్నాంజనేయస్వామికి పంచామృతాలతో, నవరసాలతో అభిషేకం చందనపూజ, ఆకుపూజ షోడశోపచారపూజలు చిత్రాన్ననైవేద్యం సమర్పించి మహాహారతి మహామంత్రపుష్పం నిర్వహించారు. యాగశాలలో ఫల పుష్పాలు సమర్పిస్తూ గణపతి నవగ్రహ రుద్రహోమం జయాదిహోమాలు జరిపి మహాపూర్ణాహుతి నిర్వహించారు. పూజల్లో వాసుదేవరెడ్డి, సునీత, పైరెడ్డి కృష్ణసావంత్, తాళ్లూరి వెంకటేశ్వరబాబు, పాంచరాత్ర ఆగమ వేదవిద్యార్థులు వెంకటరమణాచార్యులు, మేఘనాథాచార్యులు, శ్రీవర్ధనాచార్యులు పాల్గొన్నారు. ఈఓ వెంకటయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

725 మంది గైర్హాజరు
విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలో 725 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 20,711 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా అందులో 19,986 మంది హాజరయ్యారు. వారిలో 725 మంది గైర్హాజరైనట్లు గోపాల్ తెలిపారు.

నేడు చేనేత స్టాళ్లను ప్రారంభించనున్న మోదీ
కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్తువుల అమ్మకాల స్టాళ్లను మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని సోమవారం కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. ఒకటో ప్లాట్‌ఫామ్‌లో ఏర్పాటు చేసిన మూడు చేనేత స్టాళ్లను ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభిస్తారని తెలిపారు.

వందేభారత్‌కు హాల్టింగ్
సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ప్రయాణించే వందేభారత్ రైలుకు కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా రైల్వే పోలీసులు, అధికారులు బందోబస్తు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు.

స్వాగతానికి ఏర్పాట్లు..



కాశిబుగ్గ: వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం చెప్పేందుకు రైల్వే అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈకార్యక్రమానికి ఎంపీ పసునూరి దయాకర్, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

ఇందిరమ్మ కటాక్షం ఎందరికో!?

పెండింగ్‌లో 2.40 లక్షల దరఖాస్తులు

జిల్లాల వారీగా గృహలక్ష్మి కింద వచ్చిన దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు	జిల్లా	దరఖాస్తులు
హనుమకొండ	42,011	వరంగల్	44,736
ములుగు	28,503	జనగామ	28,011
మహబూబాబాద్	52,241	జేఎస్ భూపాలపల్లి	44,499

మొత్తం **2,40,001**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ఎటూ తేలకపోవడంతో గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు 'గృహలక్ష్మి'పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా నియోజకవర్గానికి 3 వేల చొప్పున ఇళ్ల నిర్మాణం కోసం అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాలకు 36 వేల మందికి ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీంతో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల నుంచి అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. 2023 అక్టోబర్ 1 నాటికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 2,40,001 దరఖాస్తులు అందినట్లు అధికారులు ప్రకటించారు. దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో కొన్నిచోట్ల అర్హుల ఎంపిక జరిగినప్పటికీ మొత్తంగా పథకం ప్రక్రియ ఆగిపోయింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మేనిఫెస్టోల్లో పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకాన్ని సోమవారం ప్రారంభించింది.

ఉమ్మడి వరంగల్‌లో 2,40,001 'గృహలక్ష్మి'దరఖాస్తులు
- గత సర్కారు హయాంలో దరఖాస్తు చేసుకున్న పేదలు
- ఎట్టకేలకు 'ఇందిరమ్మ' ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం
- ఇప్పటికే ఎదురుచూస్తున్న అర్హులు.. పెరగనున్న లబ్ధిదారుల సంఖ్య
- సొంతింటి కల నెరవేర్చుకోవడంపై ఆశలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సుమారు పదేళ్లు నిరీక్షించిన పేదల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అర్హులు సిద్ధమవుతున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం భద్రాచలంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అర్హులైన పేదలు మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు మార్గదర్శకాలను తెలుసుకుంటున్నారు. కొంతమంది మండల కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రదిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సుమారు పదేళ్లపాటు నిరీక్షించిన నిరుపేదలు.. 'ఇందిరమ్మ'పథకం ద్వారానైనా సొంతింటి కలను నెరవేర్చుకోవాలని ఉబలాటపడుతున్నారు.

బీపీఎల్‌లో ఉంటేనే అర్హత...
సొంతిల్లు ఉంటే కూడా అనర్హులే...
'ఇందిరమ్మ'పథకంపై పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఉమ్మడి జిల్లాకు చెందిన ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తారా? కొత్తగా మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందా? అనే విషయమై కూడా ఇప్పుడే తామేమీ చెప్పలేమన్నారు. కాగా 2023 అక్టోబర్ 1 నాటికి 2,40,001 మంది దరఖాస్తు చేసుకుని ఆరు నెలలు గడుస్తుండగా.. దరఖాస్తుదారుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు తమ నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను కలిసి విన్నవించుకుంటున్నారు. ఇదిలా ఉండగా అర్హులైన వారినే ఈ పథకం ద్వారా ఎంపిక చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధికారులు సైతం ఆచితూచి వ్యవహరించే ధోరణితో ఉన్నారు. ఇందిరమ్మ స్కీముకు కూడా కలెక్టర్‌లే నోడల్ అధికారులుగా ఎంపిక చేసే అవకాశం ఉందంటున్నారు. మండల పరిధిలో ఎంపీడీఓల ఆధ్వర్యంలో, మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక అధికారి, ఆర్ఐల ఆధ్వర్యంలో పరిశీలన చేయనున్నారు. సొంత స్థలం ఉందా? బీపీఎల్ పరిధిలో ఉన్నారా? లేదా? గ్రామంలోని ఓటు హక్కు ఉన్నట్లు గుర్తింపు కార్డు ఉందా? ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది?.. తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

గృహలక్ష్మి పథకం వల్ల నష్టపోయాం



మేం అద్దెకుంటున్నాం. గత ప్రభుత్వ డబుల్ బెడ్రూం ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదు. గృహలక్ష్మి పథకం మంజూరు చేసి ఆనాటి పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంటి పునాదికి రూ.1.80లక్షలు ఖర్చు చేసినా రూపాయి బిల్ల రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలి.
- మచ్చిక రమాదేవి బొల్లికుంట

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



60 గజాల స్థలంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు గదుల పెంకుటిల్లు ఉంది. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు పెట్టుకున్నా. మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇల్లు కేటాయించి నిర్మాణానికి అనుమతించాలి.
- ఆకెన వసంత, ఎల్‌బీనగర్, వరంగల్



నెర్రెలు బారుతున్నా నీళ్లొదలరా?

- డీబీఎం 24 ద్వారా అందని నీరు
- ఎండిపోతున్న పంటలు
- పంటలు కాపాడాలని రైతుల వేడుకోలు

కమలాపూర్: కోత దశకొచ్చిన పంటలు ఎండుతున్నాయి. నీరందక సాగునేల నెర్రెలుబారుతోంది. రైతన్నల కంట కన్నీరు ఉబికివస్తోంది. ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగు నీరందిస్తారనే ఆశతో పలువురు రైతులు పంటలు సాగు చేశారు. తీరా కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సరిపడా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయి ఆవేదన చెందుతున్నారు. దీంతో పలువురు రైతులు ఎండిన పంటల్లో పశువులను మేపుతున్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా పంటలకు సరిపడా సాగు నీరు విడుదల చేసి తమ పంటలు కాపాడాలని ఇప్పటికే సంబంధిత అధికారులను రైతులు కలిసి చాలాసార్లు విన్నవించారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. కోతదశకొచ్చిన పంటలు సాగు నీరందక ఎండిపోతున్నాయని తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువ నీరు విడుదల చేసి తమ పంటలను కాపాడి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆయకట్టుకు అందని నీరు
కమలాపూర్ మండలవ్యాప్తంగా ఎస్సారెస్పీ డీబీఎం 18, 20, 22ఏ, 22బీ, 23, 24 కింద సుమారు 20,932 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో డీబీఎం 24 కింద సుమారు 3,885 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువపై ఆధారపడి అంబాల, గూడూరు, గూనిపర్తి, మాదన్నపేట తదితర గ్రామాలకు చెందిన పలువురు వరి, మొక్కజొన్న సాగు చేశారు. పంట కోత దశలో ఉన్న తరుణంలో పంటలకు సరిపడా సాగు నీరందడం లేదు. సాగు నీరు అందని కారణంగా.. ఇప్పటికే 50 ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డీబీఎం 24 ద్వారా సాగు నీరందించి తమ పంటలను కాపాడి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగు నీరు వెంటనే విడుదల చేయాలి



నాకు డీబీఎం 24 కాలువ కింద ఆరెకరాల భూమి ఉంది. అందులో వరి పంట సాగు చేశాను. రెండెకరాలకు మాత్రమే నీళ్లు అందుతున్నాయి. మిగిలిన నాలుగు ఎకరాలకు నీళ్లందక వదిలిపెట్టిన. ఇప్పటికైనా కాలువ ద్వారా సాగు నీరందిస్తే దిగుబడి పెద్దగా రాకున్నా.. కనీసం పెట్టుబడులైనా వస్తయి. డీబీఎం 24 కాలువ ద్వారా వెంటనే సాగు నీరు విడుదల చేయాలి.
- జనగాని రాజేందర్, రైతు

30 గుంటలు ఎండిపోతాంది..



నాకున్న రెండెకరాలకు తోడు పక్కనే ఉన్న ఎకరం భూమి కౌలుకు తీసుకుని కాలువ నీళ్ల మీద ఆధారపడి వరి పంటేసిన. కాలువ నీళ్లందక పోవడంతో ఓ బావి కూడా లీజుకు తీసుకున్నా. అందులో కూడా నీళ్లు ఎల్లక 30 గుంటల పొలం ఎండిపోతాంది. వెంటనే కాలువ నీళ్లిచ్చి మా పంటలు కాపాడాలె.
- జేరుపోతుల రమేశ్, రైతు

సాగు నీటి కోసం రోడ్డెక్కిన రైతులు



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

- అంబాలలో ధర్నా వంటావార్పు
- నీళ్లివ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన

కమలాపూర్ మండలంలోని అంబాలలో సోమవారం సాగు నీళ్ల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టి అక్కడే వంటా వార్పు చేపట్టారు. కమలాపూర్ మండలం అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట తదితర గ్రామాల రైతుల ఆందోళనతో కాజీపేట సబ్ డివిజన్‌లోని కమలాపూర్, ఎల్కతుర్తి సీఐలు హరికృష్ణ, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు వీరభద్రరావు, సురేశ్, సిబ్బందితో అంబాలకు చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు యత్నించారు. తమకు సాగు నీరందించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించి అక్కడే వంటా వార్పు చేసుకున్నారు. ఇరిగేషన్ ఏఈఈ రాకేశ్ నచ్చజెప్పినా.. రైతులు శాంతించలేదు. చివరికి కాజీపేట ఏసీపీ తిరుమల్ రైతులతో మాట్లాడి కొందరు రైతులను ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి మాట్లాడి సాగు నీరు విడుదల చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం రైతులు ఇరిగేషన్ సీఈ రమేశ్ బాబు వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించి సాగు నీరందించి తమ పంటలు కాపాడాలని వేడుకోగా.. స్పందించిన ఆయన రెండు, మూడ్రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

మహిళా సదస్సును విజయవంతం చేయండి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

హన్మకొండ అర్బన్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరగనున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్డీఓ, ఎంపీడీఓలు, ఇతర అధికారులతో మహిళా సదస్సు విజయవంతం, ప్రజాపాలన సేవా కేంద్రాల నివేదికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. సదస్సుకు హాజరయ్యే మహిళలకు బస్సు సౌకర్యం, అల్పాహారం, భోజన, ఇతర వసతుల్ని అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా నుంచి 1,200 మంది సభకు వెళ్తుండగా.. అందుకు తగిన ఏర్పాట్లలో ఎక్కడా ఇబ్బంది లేకుండా అధికారులు చూసుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, సవరణల వివరాల్ని కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం డీఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ.. ప్రతీ మండలానికి వందమంది చొప్పున సభకు తీసుకెళ్లేందుకు రెండు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సుల్లో ఏపీఎం లైజన్ అధికారిగా ఉంటారని, అసిస్టెంట్ లైజన్ అధికారి, ఒక పోలీస్ పర్సన్ ఉంటారని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ లక్ష్మి రమాకాంత్, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించండి
ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులు త్వరిగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ 22, తహసీల్దార్ ఎల్కతుర్తి 14, తహసీల్దార్ హసన్‌పర్తి 9తో పాటు మొత్తం 176 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేశ్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ డీడీ మేన శ్రీను, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

హన్మకొండ : వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం -2024 డైరీని వరుణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరుగుతోందన్నారు. ఇందుకు అనుగుణంగా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు భూక్యా వాలు నాయక్, కార్యదర్శి అజ్మీరా శ్రీరాం నాయక్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.నందా రాథోడ్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.సదర్‌లాల్, సీజీఎంలు కె.రాజు చౌహాన్, బీకం సింగ్, అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రాజశేఖర్, కె.బి.రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.లక్ష్మణ్‌నాయక్, స్వామి నాయక్, నాయకులు సురేష్, శశికాంత్, హనుమంతు నాయక్, నాగు పాల్గొన్నారు.

నాటకరంగాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ కల్చరల్ : నాటక రంగాన్ని ప్రోత్సహించడం మన కర్తవ్యమని, మంచిమార్గం వైపు పయనించే కళ నాటకమని వరంగల్ జిల్లా (రెవెన్యూ) అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటకపోటీలు మూడోరోజుకు చేరుకున్నాయి. సోమవారం సంస్థ అధ్యక్షులు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంధ్యారాణి, ఆత్మీయ అతిథిగా వరంగల్ పాలిటెక్నిక్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.ఎం రాధాకృష్ణ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి నాటకపోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులు మాట్లాడారు. అనంతరం కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి 'విముక్తి, విజయవాడ మైత్రీ కళానిలయం వారి 'బంధం' నాటక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పారితోషిక దాతలు డా.తుమ్మూరి లక్ష్మణరావు, ప్రముఖ నటులు, దర్శకులు డా. శ్రీరామోజు సుందరరామమూర్తి, కృష్ణమూర్తి, లక్ష్మీకాంతారావు, డా.ఎన్వీఎన్ చారి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ ఆదర్శనీయం

- ఓరుగల్లు మేత్రాసనం ఫాదర్లు జయప్రతాప్‌రెడ్డి, ఇన్నారెడ్డి
- ఫాతిమా మాత ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట రూరల్ : భారతదేశంలో విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమని ఓరుగల్లు మేత్రాసనం ఫాదర్లు డి.జయప్రతాప్‌రెడ్డి, సింగారెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చిలో సోమవారం ఫాతిమా తిరునాళ్ల మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ఫాదర్లు దివ్యబలి పూజను సమర్పించారు. ఈ సందర్భంగా సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న దంపతులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో ప్రపంచ పాశ్చాత్య దేశాల పోకడలను అనుసరించడం ద్వారా భారతదేశ కుటుంబ వ్యవస్థకు ప్రమాదం పొంచి ఉందన్నారు.

రేపు 'ఆపద మిత్ర' వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: ప్రకృతి విపత్తుల సమయంలో సేవలందించేందుకు ఎంపిక చేసిన ఆపద మిత్ర వలంటీర్ల మొదటి బ్యాచ్ శిక్షణను ఈనెల 13న ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆపద మిత్ర వలంటీర్ల ఎంపికపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వలంటీర్ల ఎంపికలో 50శాతం మహిళలు ఉండేలా చూడాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మొదటి దశ శిక్షణ అనంతరం ఎంపికైన అభ్యర్థులకు దశలవారీగా శిక్షణ నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ రక్షణలో ఆపద మిత్ర వలంటీర్లు సేవలందిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటికే 150 మంది వలంటీర్లను ఎంపిక చేసినట్లు, త్వరలోనే మరో 150 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హసన్‌పర్తిలోని టీటీడీసీ, రామారం సమీపంలోని సహవికాస భవనంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీపీఓ రమాకాంత్, డీవైఎస్ఓ అశోక్‌కుమార్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ, సామాజివేత్త ఈవీ శ్రీనివాస్‌రావు, డీఎంసీ రజితరాణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల కోసం పోరాడేది బీఎంఎస్

● టీఎస్‌పీఈ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్


మాట్లాడుతున్న శశికుమార్

హన్మకొండ : ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా కేవలం కార్మికుల కోసం పోరాడే దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘం బీఎంఎస్ అని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శశికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేశ, పరిశ్రమ, కార్మిక హితమే భారతీయ మజ్దూర్ సంఘ్ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరవేయడం ఉద్యోగులతోనే సాధ్యమన్నారు. క్షేత్రస్థాయిలో సరిపడే సిబ్బంది లేకపోయిన విద్యుత్ కార్మికులు కష్టపడి గృహజ్యోతి పథకం అమలుకు ఇంటింటికి తిరిగి వినియోగదారుల వివరాలు సేకరించారన్నారు. విద్యుత్ సంస్థలో పేరుకుపోయిన కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోయామన్నారు. విద్యుత్ సవరణ బిల్లు–2023కు వ్యతిరేకంగా గతేడాది నవంబర్‌లో 40 వేల మందితో చలో పార్లమెంట్ చేపట్టిన సంఘం బీఎంఎస్ అని వివరించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వేణుమాధవ్‌కు నివాళులర్పించారు. సమావేశంలో యూనియన్ ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి, వేమన్ రెడ్డి, సంగీత్ కుమార్, సాంబరాజు శ్రీనివాస్, ఇల్లందుల రాజయ్య , మహేష్, వేణు, ప్రవీణ్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వరుడి అదృశ్యం

● ఈనెల 16న పెళ్లి..అంతలోనే మాయం


కృష్ణతేజ

హసన్‌పర్తి: మరోఐదు రోజుల్లో పెళ్లి. ఇంతలోనే వరుడు అదృశ్యమయ్యాడు. పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లిన అతడి బైక్ పలివేల్పుల ఎస్సారెస్పీ కాల్వ కట్ట వద్ద లభ్యమైంది. ఈ మేరకు బాధితుడి తల్లి శకుంతల సోమవారం కేయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలోని గోకులనగర్‌కు చెందిన భూక్యా కృష్ణ తేజ వివాహం ఈనెల 16న నర్సంపేటకు చెందిన ఓ యువతితో నిశ్చమైంది. ఈ క్రమంలో పెళ్లి పత్రికలు పంచడానికి ఈనెల 10వ తేదీన వెళ్లిన కృష్ణ తేజ.. తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు ఆందోళనకు గురై బంధువులు, మిత్రుల ఇళ్లల్లో గాలించారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా, ఎస్సారెస్పీ కాల్వ కట్ట వద్ద రెండు రోజుల నుంచి ఓ బైక్ పార్క్ చేసి ఉందనే సమాచారం మేరకు ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకున్నారు. బైక్‌ను పరిశీలించగా అందులో పెళ్లి పత్రికలు లభ్యమయ్యాయి. వెంటనే బాధితుడి కుటుంబీకులు సమాచారం అందించారు. కృష్ణ తేజ.. బైక్ పార్క్ చేసి ఎస్సారెస్పీ కాల్వలో కొట్టుకుపోయాడా? లేక పెళ్లి ఇష్టం లేక బైక్ పార్క్ చేసి పరారయ్యాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

అభిషేకం చేసేదెలా..!

● రామప్పలో శివలింగానికి మూసుకుపోయిన సోమసూత్రం
● యునెస్కో గుర్తింపు వచ్చినా పరిష్కారం కాని సమస్యలు
● 23 ఏళ్లుగా చిలకరింపు అభిషేకాలే
● అసహనం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు, భక్తులు


రామప్ప గర్భగుడిలోని శివలింగం


డ్రమ్ములోని ద్రవాన్ని బిందె ద్వారా బయట పారబోస్తున్న సిబ్బంది

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండల పరిధి రామప్ప దేవాలయ గర్భగుడిలోని సోమసూత్రం మూసుకుపోయి ఏళ్లు గడుస్తోంది. సమస్య పరిష్కరించకపోవడంతో చిలకరింపు అభిషేకాలే జరుగుతున్నాయి. గర్భగుడిలోని శివలింగానికి పంచామృతాలతో అభిషేక పూజలు చేసిన తర్వాత ఆ ద్రవపదార్థం (పాలు, పెరుగు, తేనే, నెయ్యి, చక్కెర) బయటకు వెళ్లేలా 1213లోనే కాకతీయులు సోమసూత్రాన్ని నిర్మించారు. అలాగే భక్తులు ఉదయాన్నే శివలింగంపై చెంబెడు (చెంబుతో) నీరు పోసి జలాభిషేకం చేసి భక్తిశ్రద్ధలు చాటుకుంటారు. రామప్ప ఆలయంలో శివలింగానికి నిత్యం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేక పూజలు నిర్వహించాల్సి ఉంది. అయితే సోమసూత్రం మూసుకుపోవడంతో శివలింగానికి అభిషేక పూజల సమయాలు తగ్గించడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2021లో రామప్పకు యునెస్కో గుర్తింపు రావడంతో ఆలయం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆశించిన భక్తజనానికి నిరాశే ఎదురైంది.

23 ఏళ్లుగా చిలకరింపు అభిషేకాలే

కాకతీయులు 1213లో రామప్ప ఆలయం నిర్మించినప్పటికీ 1323 నాటి నుంచి మాత్రమే నిత్యపూజలు జరిగాయి. 1911లో తిరిగి నిజాం ప్రభుత్వం ఆలయాన్ని పునరుద్ధరించినా నిత్యపూజలు జరగలేదు. దీంతో 2001లో పాలంపేట గ్రామానికి చెందిన కొంతమంది ప్రముఖులు రామప్ప ఆలయంలోని శివలింగానికి ప్రాణప్రతిష్ఠ చేసి నిత్యపూజలు ప్రారంభించారు. అప్పటికే గర్భగుడిలోని సోమసూత్రం మూసుకుపోవడంతో అర్చకులు శివలింగం వద్ద తాత్కాలికంగా మరో చిన్న పంచలోహ శివలింగాన్ని ఏర్పాటు చేసి అభిషేక పూజలు నిర్వహిస్తున్నారు. శివలింగం నుంచి వచ్చే నీరు, పాలు, ద్రవం , పూలు చేరేవిధంగా శివలింగం చివరన ఒక డ్రమ్ము ఏర్పాటు చేశారు. ముఖ్యమైన పండుగలు, ఉత్సవాలు మినహా మిగిలిన సమయాల్లో పంచలోహ విగ్రహానికి సైతం చిలకరింపు అభిషేకాలే నిర్వహిస్తుండడంతో భక్తులు అసంతృప్తికి వ్యక్తం చేస్తున్నారు. శివలింగానికి అభిషేకం చేస్తే కోరికలు నేరవేరడమే కాకుండా పరమశివుడు కాపాడుతాడనే నమ్మకంతో ఆలయానికి వస్తే ఇలాంటి పరిస్థితి నెలకొందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గర్భగుడిలో నిలిచిన నీరు

ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శివలింగానికి భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు. సుమారు 10వేలకు పైగా కుటుంబాలు హాజరై పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకించిన నీరు, పాలు, పూజ సామగ్రి డ్రమ్ములోకి చేరి నిండిపోవడంతో పాటు గర్భగుడిలో పేరుకుపోయింది. ఆలయ సిబ్బంది డ్రమ్ములోని ద్రవాన్ని బిందెలతో తీసి బయట పారపోస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 150 బిందెల ద్రవాన్ని తొలగించారు.


ఆలయ గర్భగుడిలో నిలిచిన ద్రవం

సోమసూత్రాన్ని పునరుద్ధరించాలి



రామప్ప ఆలయంలో మూసుకుపోయిన సోమసూత్రాన్ని పునరుద్ధరించాలి. ఈ విషయమై కొంతకాలంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన పురావస్తు, పర్యాటక శాఖ సమీక్ష సమావేశంలో సైతం సోమసూత్రం పునరుద్ధరణ గురించి ఆలయం తరఫున విన్నవించాం. శివలింగాన్ని శుద్ధి చేసేందుకు ఆలయంలో నీటివసతి లేకపోవడంతో గార్డెన్‌లోకి వెళ్లి బిందెల ద్వారా తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. **- కోమల్లపల్లి హరీశ్‌శర్మ, రామప్ప ఆలయ ప్రధాన పూజారి**

నైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలి

● కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

మామునూరు: ఆర్థికంగా ఎదగడానికి గ్రామీణ యువత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త రాజన్న, వరంగల్ జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు మహ్మద్ హైదర్ గౌస్ సూచించారు. ఈమేరకు సోమవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కోళ్ల పెంపకంపై రైతులకు ఆరురోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గుడ్ల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో రెండో స్థానం, కోడి మాంసం ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందన్నారు. సంవత్సరానికి సగటున 180 గుడ్లు తినాలన్నారు. అయితే ప్రస్తుతం 101 గుడ్లు మాత్రమే తింటున్నారన్నారు. అదేవిధంగా మాంసం సగటున 11.0 కిలోలు తినాలన్నారు. కానీ వినియోగం 9.8 కిలోలు ఉందన్నారు. ఈ నేపథ్యంలో కోళ్ల పెంపకంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శశంక్, డాక్టర్ సాయి కిరణ్, శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి హత్య

● కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో మృతదేహం గుర్తింపు
● సోదరుడిపైనే అనుమానం


పోశం మృతదేహం

హసన్‌పర్తి: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి హత్యకు గురయ్యాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతడు విగతజీవిగా కనిపించాడు. కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన గజెల్లి పోశం(70)కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 12ఏళ్ల క్రితం పోశం ఉద్యోగ విరమణ పొందాడు. ఇదిలా ఉండగా, పోశం, తన భార్య లక్ష్మికి చిన్న విషయాల్లో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో లక్ష్మి.. నాలుగు నెలల క్రితం భర్తతో గొడవ పడి హైదరాబాద్‌లోని ఓ ఆశ్రమంలో ఉంటోంది. ఇప్పటి నుంచి పోశం కూతురు దివ్య వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 9న రాత్రి కాల్ రావడంతో పోశం మాట్లాడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ నెల 11వ తేదీన ఉదయం రైల్వే గేట్ సమీపంలో స్థానికులు.. ఓ వృద్ధుడి మృతదేహం గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సంజీవ, ఎస్సై రాజ్‌కుమార్, విజయ్, సురేష్.. ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోశంను రాళ్లతో మోదీ హత్యచేసినట్లు గుర్తించారు. అక్కడ లభ్యమైన ఆధారాల మేరకు కుమార్‌పల్లికి చెందిన పోశంగా గుర్తించారు.

సోదరుడిపై అనుమానం?

తన తండ్రి పోశంను బాబాయి రాజేశం(మృతుడి సోదరుడు) హత్య చేసి ఉంటాడని కూతురు దివ్య ఫిర్యాదులో పేర్కొంది. తన తండ్రిని తీసుకెళ్లి మద్యం తాగించి రాళ్లతో మోదీ హత్య చేసి ఉంటారని వివరించారు. హత్యపై దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరింది.

తెగిన క్రేన్ డబ్బా వైర్..

బావిలో పడి వ్యక్తి దుర్మరణం
● ముల్కనూర్‌లో ఘటన
● మృతుడిది కరీంనగర్ జిల్లా కన్నాపూర్ గ్రామం


కుమారస్వామి మృతదేహం

ఎల్కతుర్తి: వ్యవసాయ బావి పూడిక తీత పనులు నిర్వహిస్తున్న క్రమంలో క్రేన్ డబ్బా వైర్ తెగింది. ఈ ప్రమాదంలో ఓ దినసరి కూలీ బావిలోపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన రెడ్డి కుమారస్వామి(48) ఎనిమిది రోజుల క్రితం తన అత్తగారి ఊరు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు వచ్చాడు. వేసవి సమీపించిన తరుణంలో వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోవడంతో పలువురు రైతులు తమ బావుల్లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో పూడికతీత పనులు చేపడుతున్న కుమారస్వామి.. క్రేన్ సాయంతో బావిలోకి దిగుతున్న క్రమంలో వైర్ తెగింది. దీంతో కుమారస్వామి బండ మీద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య రెడ్డి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి..

● నర్సింగాపూర్‌లో ఘటన
● మిన్నంటిన తల్లి, బంధువుల రోదనలు


కృష్ణప్రసాద్ (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి : ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి.. బావిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం మండలం శంకర్ రాజుపల్లికి చెందిన పెద్ది కృష్ణ ప్రసాద్ (13) ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని సమ్మక్క బాలుర విద్యాలయ వనవాసీ కల్యాణ పరిషత్ హాస్టల్‌లో ఉంటూ ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈత కొట్టడానికి ముగ్గురు విద్యార్థులతో కలిసి నర్సింగాపూర్ గ్రామంలోని కాంభోజా చెరువు సమీపంలోని బావికి వెళ్లాడు. అక్కడ ఈత కొడుతూ నీటిలో మునిగాడు. ఎంతకూ పైకి తేలకపోవడంతో మిగతా విద్యార్థులు భయంతో తిరిగి వచ్చారు. హాస్టల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులకు విషయం తెలుపడంతో వారు బావి వద్దకు వెళ్లి చూడగా కృష్ణప్రసాద్ టోపీ, గడియారం, దుస్తులు కనిపించాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని కృష్ణప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, కృష్ణప్రసాద్ తండ్రి కేశవులు మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి దేవి కుమారుడు రెక్కలుముక్కలు చేసుకుంటూ కృష్ణప్రసాద్‌ను చదవివించడంతోపాటు కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో ఉన్నతంగా చదివి ప్రయోజకుడు అవుతాడనుకున్న కృష్ణప్రసాద్ ఇంతలోనే మృతి చెందడంతో తల్లి దేవి, బంధువుల రోదనలు మిన్నంటాయి.

సాంకేతిక లోపంతో నిలిచిన 'ఇంటర్‌సిటీ'


గార్ల: రైలుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న లోకోపైలట్లు

గార్ల/డోర్నకల్: గార్ల పాకాల ఏటి వద్ద సోమవారం గ్యాంగ్‌మెన్ జాకీ ఏర్పాటు చేసి రైల్వే లైన్ మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు జాకీరాడ్ తగిలింది. దీంతో రైలు ఇంజిన్ వెనుక గ్యాస్‌పైపు, జనరేటర్ బోగికి చెందిన పైపులు పగిలాయి. ఫలితంగా రైలు గార్ల రైల్వేస్టేషన్‌లో 30 నిమిషాలు నిలిచింది. వెనుక నుంచి వస్తున్న రైలును గమనించకుండా గ్యాంగ్‌మెన్ లైన్ మరమ్మతులు చేయడంతోనే ఈ ఘటన జరిగినట్లు సమాచారం. గార్ల రైల్వేస్టేషన్‌లో పైపులైన్లకు లోకోపైలట్ తాత్కాలిక మరమ్మతులు చేసి రైలును డోర్నకల్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ సీ అండ్ డబ్ల్యూ, లోకో సిబ్బంది పూర్తిస్థాయి మరమ్మతులు చేసి రైలును పంపించారు. కాగా, ఈ ఘటనలో రైలుకు పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గార్ల, డోర్నకల్‌లో రైలు సుమారు 55 నిమిషాలు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


శ్రీలత (ఫైల్)

గీసుకొండ : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది.ఈ ఘటన మండలంలోని మచ్చాపూర్‌లో జరిగింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోల శ్రీలత(55) సోమవారం తెల్లవారుజామున తన బంధువుల వద్ద నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో వినాయక ఫర్టిలైజర్ షాపు ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొని కొంత దూరం వరకు ఈడ్చుకుని వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

● రూ.7.79లక్షల విలువైన సరుకు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు. సుబేదారి ఎస్సై రవికిరణ్.. సిబ్బందితో కలిసి ఆదివారం హంటర్‌రోడ్డులోని విశాల్ మార్ట్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసిన ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం తనిఖీ చేయగా రూ.7,79,700 విలువైన 51.98 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, నిందితులను ఒడిశాలోని గజపతి జిల్లా రాజపుర గ్రామానికి చెందిన జయరాజు లీమా, లీమా రాజకుమారిగా గుర్తించామన్నారు. తనిఖీల్లో సుబేదారి ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు రవికిరణ్, సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ..

● 17 మంది మహిళా కూలీలకు గాయాలు
● ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంకు తరలింపు
● రేగొండ మండలం చెన్నాపూర్ వద్ద ఘటన



ప్రమాదానికి గురైన ఆటో

రేగొండ: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను రెడిమిక్స్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 17 మంది కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెన్నాపూర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా పరకాల ఎస్సీ కాలనీకి చెందిన 17 మంది మహిళా కూలీలు ఆటోలో రేగొండ మండలం పోచంపల్లి గ్రామంలో మిరపకాయలు ఏరడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చెన్నాపూర్ వద్ద రెడిమిక్స్ లారీ.. ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించి స్థానికులు.. క్షతగాత్రులను అంబులెన్స్‌లో పరకాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

క్షతగాత్రులతో నిండిన పరకాల ఆసుపత్రి


పరకాల సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పరకాల: రేగొండ మండలం చెన్నాపూర్ వద్ద రెడ్‌మిక్స్ లారీ.. ఆటోను ఢీకొన్న ఘటనలో గాయపడిన 17 మంది మహిళా కూలీలను పరకాల సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఇందులో బొచ్చు శాంత, బొచ్చు కొమురమ్మ, బొచ్చు ప్రమీలకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, క్షతగాత్రులతో పరకాల సివిల్ ఆసుపత్రి నిండింది. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను.. బాధితులను పరామర్శించారు.

అదనపు విద్యార్హతలపై దృష్టిసారించాలి

● కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి


శిక్షణ పొందిన విద్యార్థులతో మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ : కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్(సెల్ట్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్యాంపస్‌లో ఉన్న సమయంలోనే అదనపు విద్యార్హతలపై దృష్టి సారించాలన్నారు. కేయూ ఆంగ్ల విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎం.రాజగోపాలచారి మాట్లాడుతూ ఆంగ్లభాషా ప్రావీణ్యంతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ మాట్లాడుతూ.. తరగతుల అనంతరం విద్యార్థులు లైబ్రరీ, స్పోర్ట్స్‌తో పాటు తమకు ఆసక్తి ఉన్న అంశాలపై దృష్టిసారించాలన్నారు. సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ మేఘనారావు మాట్లాడుతూ.. 40 రోజుల శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తిచేశామని, నిష్ణాతులతో శిక్షణ ఇచ్చామన్నారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు మల్లారెడ్డితో పాటు తదితరులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఆంగ్ల విభాగ అధిపతి డాక్టర్ బి.దీపాజ్యోతి, స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆ తల్లిదండ్రుల ఆచూకీ ఎక్కడ?

● లభించని సమాచారం
● పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు

గార్ల: తమ ఇద్దరి పిల్లలకు పాలల్లో విషం కలిపి ఇచ్చి చంపిన తల్లిదండ్రుల ఆచూకీ సోమవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. వీరి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. తల్లిదండ్రులు అనిల్‌కుమార్, దేవి.. సోమవారం ఓ వ్యక్తికి ఫోన్ చేసి తాము కూడా ఆత్మహత్య చేసుకుంటున్నామని చెప్పినట్లు పుకార్లు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన ఎస్సై జీనత్‌కుమార్ బయ్యారం, గార్ల మండలాల్లో పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టినట్లు సమాచారం. అయినా వారి ఆచూకీ లభించలేదని తెలిసింది. చిన్నారులను హతమార్చిన తల్లిదండ్రులు ఎక్కడైనా ఆత్మహత్య చేసుకున్నారా.. లేక పరారయ్యారా.. అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. చిన్నారులు మృతి చెంది రెండు రోజులైనా తల్లిదండ్రుల ఆచూకీ లభ్యం కాకపోవడం ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ దీపిక


విజేతలతో ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ దీపిక

కాజీపేట రూరల్ : ఆధునిక కాలంలో మహిళలు పురుషులతో పోటీపడి వారికి ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కాజీపేట సబ్ డివిజనల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ బి.దీపిక కృష్ణసాయి అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బి.దీపిక కృష్ణసాయి పాల్గొని స్టార్ మహిళా ఆటలపోటీలను ప్రారంభించి మాట్లాడారు. రైల్వే విభాగాల్లో బిజీబిజీగా విధులు నిర్వర్తిస్తు పని ఒత్తిళ్లను అధిగమించి ఉమెన్స్ డే వేడుకల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు. ఆటల పోటీల్లో గెలిచిన మహిళలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరి దేవుపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, వరలక్ష్మి, జయప్రద, కౌసల్య, శారద, కవితతో పాటు రైల్వే కార్మిక మహిళలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పారా తైక్వాండో పోటీలకు గౌతమ్


గోల్డ్ మెడల్‌తో గౌతమ్

వరంగల్ స్పోర్ట్స్: హరియాణలోని అంబాలలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పారా తైక్వాండో పోటీలకు పైడిపల్లికి చెందిన ఎస్ఎంఏ అకాడమీ చీఫ్ ఎల్లావుల గౌతమ్ యాదవ్ ఎంపికయ్యారు. తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ కూకట్‌పల్లిలోని 'టైట్ ఎండ్ స్పోర్ట్స్ ఎరీనా' వేదికగా మొదటిసారి నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గౌతమ్ యాదవ్ సీనియర్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొనగా గౌతమ్ యాదవ్‌తో పాటు భూపాలపల్లికి చెందిన జశ్వంత్ సబ్ జూనియర్ విభాగంలో గోల్డ్, మహబూబాబాద్‌కు చెందిన సిద్ధు, అరవింద్ జూనియర్స్ కేటగిరీలో గోల్డ్ మెడల్స్ సాధించారు. కాగా, గౌతమ్‌ను రాష్ట్ర ఇన్‌చార్జ్ గణేష్‌యాదవ్, రాష్ట్ర పరిశీలకుడు బాబులాల్, టెక్నికల్ అఫీషియల్స్ తరుణ్, పవన్ అభినందించారు.